దసరాకి స్త్రీల వ్యాస రచన పోటీలోరెండవ బహుమతిరు. 200/-పొందిన వ్యాసం

# సంసారంలో టి.వి.తెచ్చే సమస్యలు

ఇటీవలి వరకు 'టి.వి.' కూడా స్టేటస్ సింబల్స్‌లో ఒకటిగా చలామణి అయింది. మధ్యతరగతి కుటుంబీకులు కూడా టి.వి.ని తప్పనిసరిగా గృహాలంకరణ చేయాలన్న నిర్ణయానికి వస్తున్నారు. అందుకు సాక్ష్యమే వాడవాడలా అనేక ఇళ్లపై ప్రత్యక్షమవుతున్న టి.వి. ఏంటిన్నాలు.

ఇకపోతే, టి.వి. ఉన్నవాళ్లకు, టి.వి. లేనివాళ్లకు ఎన్నెన్నో సమస్యలు నిత్యం ఎదురవుతుంటాయి. టి.వి. ఉన్నవాళ్ళ యింటికి అవి లేని వాళ్ళ పిల్లలు ప్రతి రోజూ తప్పనిసరిగా హాజరవుతుంటారు. (బహుశా వాళ్ళు తమ పాఠశాలలకు కూడా అంత శ్రద్ధగా హాజరుకాకపోవచ్చు) వచ్చిన యిరుగు పొరుగువాళ్లను నిరుత్సాహపరచడం అంత భావ్యం కాదు కాబట్టి, ఇంటిలో పరిస్థితులు ఎలా వున్నా, తప్పని సరిగా టి.వి. కార్యక్రమాలకు ప్రతి రోజూ ప్రేక్షకులుగా మారవలసి వుంటుంది. పైగా అందరికీ అనువైన రీతిలో కూర్చొని సావకాశంగా తిలకించే ఏర్పాట్లను చేయా..

ఒకవేళ ఇంటిలో ..వరికైనా టి.వి. కార్యక్రమాల పట్ల అయిష్టం కలిగి.., నోరు మూసుకొని పడి ఉండాలి తప్ప, మిగతా వారిని చూడవద్దని శాసించలేరు. టి.వి. కార్యక్రమాలను ఆసక్తిగా చూసేవాళ్ళు అనారోగ్యంతో బాధపడే చుట్టుపక్కల వాళ్ళ గురించి కూడా ఏమాత్రం ఆలోచించకుండా, కనీస మానవత్వాన్ని సైతం విస్మరించి శబ్దాన్ని విపరీతంగా పెంచుతూ మరీ వినోదిస్తుంటారు. అలాగే మనలోనే ఎందరో ఆయా సందర్భాలను బట్టి, విద్యార్థులు పరీక్షల కొరకై చదవడం, నిరుద్యోగులు ఇంటర్వ్యూలకై ప్రిపేరవడం... యిలా... వాళ్ళ వాళ్ళ కార్యక్రమాలలో నిమగ్నంకావలసి వుంటుంది. అయినా, యివన్నీ ఎవరు ఆలోచిస్తారు, ఎవరి స్వార్థం వాళ్ళదే అన్నట్లు లోకం తీరు ఉంటే!

ఇక టి.వి. కార్యక్రమాలలో వచ్చే ఆయా సంఘటనల మంచి చెడుల వ్యత్యాసాన్ని గమనించకుండా వాటిని గుడ్డిగా అనుకరించడానికి కొందరు పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

కొన్ని సందర్భాలలో పెద్దలు కూడా యిందుకు ఏమాత్రం తీసిపోరు. హిప్నటైజ్ చేసే రీతిలో చూపే వాణిజ్య ప్రకటనలను చూసి చూసి వాటిని పొందాలన్న వ్యామోహాన్ని పెంచుకోవడం కూడా జరుగుతోంది.

ఇంత జరిగినా టి.వి. కార్యక్రమాల ద్వారా విజ్ఞానదాయకమైన వినోదాన్ని పొందగలుగుతున్నామా అంటే అదీ లేదు. ఆయా కార్యక్రమాల నిర్వాహకుల అభిరుచి మేరకే, మన పరిశీలనా పరిజ్ఞానాన్ని పరిమితం చేసుకోవాలి. అదే టి.వి. లేని రోజుల్లో వినోద కార్యక్రమాలను తిలకించే పేరుతో అప్పుడప్పుడూ కుటుంబ సభ్యులంతా కలిసి నాట్య ప్రదర్శన శాలలకో, సినిమా థియేటర్లకో ఎంతో ఉత్సాహంగా వెళ్లటం జరిగేది. ఆ సందర్భంలో అక్కడ చేరిన అనేకమందితో పరిచయం చేసుకొనే అవకాశమూ ఉండేది. పలు వర్గాల ప్రజల మధ్య కలిసిపోయి వినోదాన్ని తిలకించే చక్కటి అనుభూతిని టి.వి.లు వచ్చి ఒకింత మటుమాయం చేస్తున్నాయి. అందుకే ఎవరికి వారు కూపస్థమండూకంలా, ఒకే చోట గిరి గీసుకొని ఉండవలసి వస్తోంది.

ఈనాడు 'టి.వి.'ల ద్వారా వార్తలు వింటూ



ఆయా కార్యక్రమాలను చూస్తున్నాముగా అని సంతృప్తి చెందే అల్పసంతోషు లెందరో ప్రపంచపరమైన పలు వార్తలను సేకరించి ఎప్పటికప్పుడు తాజాగా అందించే వార్తా పత్రికలను సయితం చిన్నచూపు చూస్తున్నారు. ఈ విధంగా మనుషుల మధ్య దూరాన్ని పెంచే టి.వి. వంటి ఆధునిక సదుపాయాలు, సాధనాలు తెచ్చే సమస్యలు ఒక్క సంసారానికే పరిమితం కాకుండా, మొత్తం సమాజానికే ప్రశ్నార్థకం కాగలవు.

—డాక్టర్ నాగరాజ లక్ష్మి
హైదరాబాద్




గీత్‌మాల క్యాసెట్ గెలుచుకున్న
కాలమ్ దాటని కథ

## శీలపరీక్ష

సాయంత్రం అయిదు గంటలయ్యింది. ఆఫీసుల్లోంచి ఉద్యోగినులు, ఉద్యోగస్తులు బయట పడుతున్నారు. ఆ ఉద్యోగిని పేరు రజని. ఆమె వెనకాల అదే ఆఫీసులో పనిచేస్తున్న సహ ఉద్యోగి యోగి నడుస్తున్నాడు. "మాస్టారూ" అంటూ పిలిచా రెవరో వెనకనుండి.

"ఎవరు మీరు? ఏం కావాలి?" అన్నాడు యోగి ఆ అపరిచితుణ్ణి చూసి.

"మీ ముందు వెళ్ళే ఆమె గురించి మీకు తెలుసా? ఆమె పట్టి తిరుగుబోతు" అన్నాడు తను.

"డోన్టాక్ రాట్! ఆమె నిప్పులాంటిది" అన్నాడు యోగి కోపంగా.

"పొండిసార్... మీకేం తెలుసు బెండకాయ పులుసు? వంద రూపాయిలిచ్చిన ప్రతి కొలీగ్‌కూ... నా యవ్వనం ఇంద... అని పంచి ఇస్తుందటగా అది"

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్... ఆమె చాలా పొందికయిన గృహిణి. ఆన్సర్ టు ది పాయింట్ తప్ప... ఎవర్నీ చనువు తీసుకోనివ్వదు" అన్నాడు యోగి అసహనంగా.

"ఊరుకోండి సార్ మీరు మరీను. ప్రతి రోజూ లంచ్ అవర్లో... ఆఫీసరుగారి రూంలో తలుపులు వేసుకుని వలపులు... వయ్యారాల సయ్యాటలు పంచుకుంటుందటగా?"

"మిస్టర్, హోల్డ్ యువర్ టంగ్! ఆమె పొందిక... నడవడిక చూస్తే... ఆఫీసరుకూడా సద్భావంతో చేతులెత్తి దణ్ణం పెట్టాల్సిందే...! ఇంతకూ ఇవన్నీ ఎందుకు మీకు?" అన్నాడు యోగి పళ్ళ బిగువున తమాయించుకుంటూ.

"హి... హి... హి... మీకో ఛాన్సిచ్చిందా ఏమిటండీ బాబూ? తెగ పొగడేస్తున్నారామెని..." అంటూ వెకిలిగా నవ్వాడా వ్యక్తి.

"యూ బ్లడీ రోగ్! ఎవ్రడా నువ్వు...? ఉద్యోగం చేసుకునే ఆడవాళ్ళమీద పేడ నీళ్ళు జల్లుతున్నావ్..." అంటూ చెప్పు తియ్యబోయాడు యోగి... పళ్ళు పటపట నూరుతూ.

"భార్యను గురించి భర్త ఆ మాత్రం ఎంక్వయిరీ చేసుకోకూడదంటారా?" అన్నాడ తను అమాయకంగా నిశ్చేష్టుడయిన యోగి చెప్పు తీయలేకపోయాడు.

– వడ్లమన్నాటి కుటుంబరావు